**జర్నలిస్ట్ కథలు**

# ఆంధ్రాస్‌కి శ్రద్ధాంజలి

◆ జొన్నలగడ్డ రాధాకృష్ణ ◆

## టీవి డైరెక్టర్ని ఇంటర్వ్యూ చెయ్యమని ఆదేశించాడు త్రయంబకం గుర్నాధాన్ని.

టీవీలో కవిసమ్మేళనాలలో గానీ, సాహిత్య గోష్ఠుల్లో గానీ, కనీసం బడ్జెట్ చర్చల్లో గానీ పాల్గొనమని టీవీ వాళ్ళు త్రయంబకాన్ని బతిమాల్డం లేదు. నిజం చెప్పాలంటే అస్సలు కేర్ చైడం లేదు. అసలే జ్ఞాన్‌పీఠ్ అవార్ట్ రానందుకు అగ్గి మీద గుగ్గిలం అయిపోతున్న త్రయంబకం టీవీ వాళ్ళు కూడా తనని గుర్తించకపోయేనరికి తట్టుకోలేక పోయాడు. ప్రతీకార వాంఛ అతనిలో భగ్గు మంది. తనని ఇంటర్వ్యూ చెయ్యని వాళ్ళకి తగిన శాస్తి చెయ్యాలంటే తన పేపర్లో వాళ్ళ ఇంటర్వ్యూ వెయ్యడం ఒక్కటే మార్గం అనిపించినట్టుంది. వెంటనే గుర్నాధానికి అతి నీచమైన, నికృష్టమైన కొన్ని ప్రశ్నలు రాసిచ్చి అవన్నీ అడగమని చెప్పాడు.

ఎడిటర్ చెప్పాక తప్పదు గనక సదరు ప్రశ్నల్ని భుజాన వేసుకుని టీవీ స్టుడియోకి వెళ్ళాడు.

టీవీ డైరెక్టర్ బానే మర్యాద చేసి ఓ కప్పు కాఫీ కూడా ఇచ్చాడు. ఇంతలో ఫోను వొచ్చింది- "అంతరాయానికి మన్నించాలి" అంటూ డైరెక్టర్ ఫోను అందుకున్నాడు.

"హాలో టీవీ డైరెక్టర్ హియర్"

"......"

"చెప్పండి ఏం కావాలో"

"అదేం లేదు. ఆ ప్రోగ్రామం చాలా బావుందని వుత్తరాలు వొస్తున్నాయి. ఆ పాటలు పాడినాయన సాక్షాత్తూ కేంద్ర మంత్రిగారి అబ్బాయి. ఆయన పాటలు విని పిల్లలు ఝడుసుకుంటున్నారని గానీ, ఏడ్చే పిల్లల్ని ఊర్కొబెట్టడానికి తల్లులు ఆయన పేరు బూచాడి పేరు బదులు వాడుతున్నారనిగానీ, ఫలానా ఆయన్ని పిలిచి పాడిస్తాం అనగానే పిల్లలు ఠపీమని ఏడుపు ఆపేస్తున్నారని గానీ మీరు చెపుతుంటే నమ్మలేకపోతున్నాం. ఎందుకంటే మా ఇంట్లో కూడా మా మనవలు వున్నారు. వాళ్ళని వూరుకోబెట్టడానికి మేం ఇంకా బూచాణ్ణే వాడుతున్నాం. మీకు ఎవరో కిట్టని వాళ్ళు చెప్పివుండాలి..."

అవతలి వాడు ఏదో అన్నాడు.

డైరెక్టర్ మొహం మాడిపోయింది.

బహుశా 'నీ పిండాకుడు' అని వుండచ్చని వూహించాడు గుర్నాధం.

మళ్ళీ అవతలి వాడే ఏదో అన్నాడు.

"ఏం చెయ్యమంటారండీ- పాపం రైతులు వాళ్ళకి వ్యవసాయం రాక నానా తిప్పలూ పడుతున్నారు. వాళ్ళకి ఎలా వ్యవసాయం చెయ్యాలో నేర్పాల్సిన బాధ్యత గవర్నమెంటు మీద లేదూ..."

"........"

"అదే, వొస్తున్నా అక్కడికే. పిడకలెలా చెయ్యాలో నేర్పడం కూడా తప్పంటారు. ఇవాళ ఎంత మందికి వొచ్చండీ పిడకలు చెయ్యడం. మీ ఆవిణ్ణి అడగండి వొచ్చేమో. పోతే, భోజ నాల టైములో ఈ ప్రోగ్రాం లేమిటంటారు. తెలుగువాళ్ళు ఏదైనా ఒహాపని బాగా చెయ్యగలరూ అంటే అది భోజనం మాత్రమే. ఇహ తెలుగు వాడు భోజనం చెయ్యని టైములోనే ఓ ప్రోగ్రా ప్రసారం చెయ్యాలీ అంటే అది జరిగే పనే కాదు. ఏ టైములో తెలుగువాడు తినడో చెప్తే తప్పకుండా ఆ టైములో ప్రసారం చేస్తాం" అనేసి విసుగ్గా టెలిఫోన్ పెట్టేశాడు డైరెక్టరు.

"చూడండి వీళ్ళ దబాయింపు, పోనీగదా అని చచ్చేట్టు బుర్రలు పాడుచేసుకుని ఈ ప్రోగ్రాం తయారు చేస్తే కృతజ్ఞత లేకపోగా నిలదీస్తున్నారు, తెలుగు జాతే అంత. ఇదే ఏ గ్రీసు దేశంలోనో చేశాం అనుకోండి అక్కడి జనం మనకి యావజ్జీవితం రుణపడి వుండిపోయే వారు. సర్లెండి- ఆ గోలకేం గానీ మీరేదో ఇంటర్వ్యూ అన్నారుగా, అడగండి."

"ఏం అడగ మన్నారు? నేను అడగదలిచిన ప్రశ్నలన్నీ ఆ ఫోన్లో ఆయన అడిగేశాడు" అన్నాడు గుర్నాధం నీరసంగా.

ఆ డైలాగు సరిగా అర్థం కాలేదు డైరెక్టర్‌కి.

"పిడకలు చెయ్యడం నేర్పకోడదంటాడు. ఎందరికి వొచ్చు చెప్పండి పిడకలు చెయ్యడం ఇవాళ ఉదాహరణకి మీకు వొచ్చా" అన్నాడు డైరెక్టరు.

"నాకు రాదుగానీ మా ఎడిటర్‌గారికి వొచ్చు. అయితే వాటికి ఆయన వేరే పేర్లు పెట్టుకున్నాడు. కొన్ని సార్లు వాటిని సంపాదకీయాలు అంటాడు. కొన్నిసార్లు పద్యాలు అంటాడు" అన్నాడు గుర్నాధం.

ఈ డైలాగూ అర్థమైనట్టు లేదు ఆయనకి.

"ఇంతకీ మా ప్రోగ్రాంల గురించి మీ అభిప్రాయం చెప్పారు కాదు" అన్నాడు.

వాళ్ళ ప్రోగ్రాంల గురించి తన అభిప్రాయం చెపితే ఆయన గుండె పగిలి పోతుందనే విషయం తెలిసి గుర్నాధం చెప్పలేదు.

"తెలుగు వాళ్ళకి దేశభక్తి తక్కువగా వుందని మీకు అనుమానమా" అని అడిగాడు.

"అనుమానం ఏం లేదు. తెలుగు వాళ్ళకి అస్సలు వుండేది కాదు దేశభక్తి- ఇక్కడ టీవీ స్టేషన్ పెట్టక ముందు. దాంతో దేశభక్తి బృందగానాలు వెయ్యడం మొదలు పెట్టం.

> ఆ మధ్య భక్తిగీతాలు ఎడ తెరిపి లేకుండా వేసేనరికి భక్తి పెచ్రేగి పోయింది. దాంతో ఇక ఆ డోసు చాల్లే అని ఆపుచేశాం!

ఇప్పుడు ఫరవాలేదు. బానే ఇంప్రూవ్ అయ్యారు. టీవీ వాళ్ళంటే డాక్టర్ల లాంటి వాళ్ళే. ఏది తక్కువైతే అది ఓ డోసు వేస్తూ పోవడమే మా డ్యూటీ. ఈ మధ్య భక్తి గీతాలు తగ్గించేశం చూశారూ. ఎంచేత? ఆ మధ్య భక్తిగీతాలు ఎడతెరిపి లేకుండా వేసేసే సరికి భక్తి పెర్రేగిపోయింది. దాంతో ఇంక ఈ డోసు చాల్లే అని ఆపు చేసేశాం. ఇప్పుడు మనకి తక్కువైంది స్పోర్ట్సు. దీనికి ఓ డోసు తగిలించాలన్న మాట-

"ఆడరా ఆడరా
ఆడరా ఆంధ్రుడా
హై జంపులు చెయ్యరా
లాంగు జంపు దూకరా
క్రికెట్టులో గెల్వరా
టెన్నిస్‌లో నిల్వరా
హాకీలో ముందురా
మెడల్సు నీకందురా

అని ఒహోయన పాట కూడా అప్పుడే రాసేశాడు. ఓ యాభై మందిని పెట్టి బృంద గానం లాగించేస్తున్నాం. అ దెబ్బకి చూడండి క్రీడారంగంలో మనం ఎక్కడుంటిమో" అని ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు డైరెక్టరు.

గుర్నాధానికి భయం వేసింది. డైరెక్టర్ మాటల్ని బట్టి చూస్తే టీవీ ప్రేక్షకుల భవిష్యత్తు ఇప్పటికన్నా మిక్కిలి అంధకార బంధురంగా వుండేట్టు కనిపిస్తోంది.

"టీవీ సీరియల్స్ ఏ బేసిస్‌లో సెలెక్ట్ చేస్తారు?"


టీవీ డైరెక్టర్ నర్మగర్భంగా నవ్వాడు. తన ప్రశ్నకి నర్మగర్భంగా గానీ మామూలుగా గానీ ఎందుకు నవ్వొచ్చిందో అర్థం కాలేదు గుర్నాధానికి.

"సీరియల్‌లో సందేశం వుండాలి. సమకాలీన సమాజానికి అద్దం పట్టాలి. కమిటీలో ఓ కేంద్ర మంత్రి బావమర్ది, రాష్ట్రమంత్రిగారి అల్లుడు, నలుగురు ఎంపీల వేలువిడిచిన బంధువులూ, విస్తారంగా ఫ్లాప్ సినిమాలు తీసిన ఓ మాజీ నిర్మాత, ఆరుగురు మాజీ మంత్రులూ సభ్యులుగా వున్నారు. వీళ్ళంతా ప్రతి స్క్రిప్టూ కూలంకషంగా పరీక్షించి అప్పుడు సెలక్ట్ చేస్తారు. అందుకే ఎక్కడా వేలెత్తి చూపడానికి వీల్లేకుండా పకడ్బందీగా వుంటాయి మా సీరియల్స్."

> ఒహ లావుపాటి ఆవిడ లోపలికి వచ్చేసి కుర్చీలో స్వచ్ఛందంగా కూర్చొని, రైలింజను కూతలాంటి స్వరంతో 'నమస్తే' అంది.

ఇప్పుడర్థం అయింది గుర్నాధానికి డైరెక్టర్ ఎందుకు నర్మగర్భంగా నవ్వాడో

ఇంతలో తలుపు తోసుకుని ఓహ లావుపాటి ఆవిడ లోపలికి వొచ్చేసి కుర్చీలో స్వచ్ఛందంగా కూచుని రైలింజను కూతలాంటి స్వరంతో 'నమస్తే' అంది.




డైరెక్టర్‌గారు ఓ సారి కంగారు పడేసి లేచి నిలబడిపోయి నమస్కారం పెట్టి మళ్ళీ కూచుని నవ్వు మొహం పెట్టి అలాగే వుండి పోయాడు.

"వొచ్చేవారం నేపాడబోయే జానపద గేయాల మీద అప్పుడే శ్రోతల అభిప్రాయాలు కూడా పట్టుకొచ్చేశా. ఇంటి దగ్గిర ప్రాక్టీస్ చేసేప్పుడు మా వారి దగ్గిరికి వొచ్చే ఆఫీసర్లు వాళ్ళ భార్యలూ నా పాట విని ఒహాటే ఇదైపోయి, వాళ్ళ వాళ్ళ అభిప్రాయాలు రాసి ఇచ్చేశారు. తొందర్లేదు లెండి ప్రోగ్రాం వేసిన మర్నాడు చదవొచ్చు వీటిలో..."

ఈయన గుర్నాధం గారని ప్రెస్ రిపోర్టర్. ఈవిడ మిసెస్ కనకలక్ష్మి- పోలీస్ కమిషనర్ గారి భార్య" అని పరిచయం చేశాడు డైరెక్టర్.

అప్పుడు గుర్తొచ్చింది గుర్నాధానికి పోయిన వారం ఈవిణ్ణి టీవీలో చూసిన విషయం.

"మళ్ళీ పాడుతున్నారా టీవీలో" అన్నాడు దీనంగా.

"ఎప్పుడో పోయిన వారం పాడాను. రోజూ ఫోన్సు చేసి పాడమంటున్నారు ఫాన్సు. తీరిక లేకపోయినా తప్పడం లేదు" అంది కనకలక్ష్మి దిగులుగా.

"ఆ ఫాన్సు అలా అంటూనే వుంటారు గానీ మనం వాళ్ళు చెప్పినట్టల్లా చేసెస్తే లోకువైపోతాం మేడం- నా వుద్దేశంలో ఓ ప్రోగ్రాంకీ మరో ప్రోగ్రాంకీ మధ్య అయిదేళ్ళయినా గాప్ వుండాలి. అప్పుడే గ్లామర్ వుంటుంది" అన్నాడు గుర్నాధం ఆంధ్ర ప్రజానీకానికి ముంచుకొస్తున్న ముప్పుని ఎలాగయినా తప్పించాలనే సంకల్పంతో.

కనకలక్ష్మి తల అడ్డంగా తిప్పింది, "లాభం లేదు సార్. నేనెవరి మనసునీ నొప్పించలేను. నాకు అదో వీక్నెస్. శ్రోతల కోరికని కాదన లేను" అంది.

"ఏమనుకోరు లెండి. అంతా మన డిపార్ట్‌మెంట్ వాళ్ళేగదా" అన్నాడు గుర్నాధం అప్పటికీ. ఆవిడ అనలా మాటే వినిపించుకో లేదు.

"మీలా శ్రోతల విషయంలో అందరికీ కమిట్‌మెంట్ వుండదు సుమండీ" అంటున్నాడు టీవీ డైరెక్టర్ ఆనంద పారవశ్యంతో.

"మా వారు కరీంనగర్‌లో ఎస్పీగా వుండే రోజుల్లో ఓ సారి కచ్చేరీ చేశా. టిక్కెట్టు పెట్టినా హౌస్‌ఫుల్ అయిపోయింది.

"మీకో విషయం తెలుసో తెలీదో నేను వొంటలు అద్భుతంగా చేస్తాను. వొంటల ప్రోగ్రాం వొహటి ప్రవేశపెట్టరాదూ టీవీలో" అంటోంది కనకలక్ష్మి గోముగా.

"కూరగాయలూ బియ్యం ఏవీ కొనకుండా వొంట చేసే విధానం నేర్పండి- ప్రజలు ఆనందిస్తారు. అయ్యా డైరెక్టర్‌గారూ వొస్తా- ఆంధ్రా టీవీ ప్రేక్షకులారా మీకిదే నా శ్రద్ధాంజలి" అని సంచి భుజానేసుకుని బయటికి నడిచాడు గుర్నాధం.